చేతి వృత్తిదారులకు యంత్రాల పంపిణీ

లబ్ధిదారులతో ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ చైర్మన్ మనోజ్‌కుమార్

అబిడ్స్, మార్చి 9 : ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో ఖాదీ ఉత్పత్తి, అమ్మకాలు భారీగా పెరిగాయని, దీంతో గ్రామీణ భారత దేశంలోని వృత్తిదారులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ చైర్మన్ మనోజ్‌కుమార్ అన్నారు. అంతేగాకుండా ఖాదీ గ్రామీణ పరిశ్రమ ఉత్పత్తులు ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందాయన్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో మోదీ సర్కార్‌కి గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా గ్రామోద్యోగ్ వికాస్ యోజన కార్యక్రమంలో భాగంగా పలు చేతి వృత్తుల్లో శిక్షణ పొందిన వారికి ఉచితంగా యంత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మనోజ్ కుమార్ మాట్లాడుతూ.. తొమ్మిదేండ్లుగా ఖాదీ వేతనాన్ని 33 శాతానికి పైగా పెంచడం వలన చేత్తి వృత్తుల వారు ఖాదీ పని వైపు వెళ్లారన్నారు. అంతకు ముందు తేనె టీగల బాక్సులు, బీ బాక్సులు, చేతి వృత్తి దారులకు టూల్ కిట్‌లు, యంత్రాలు, ఎలక్ట్రిక్ కుమ్మరి సారెలు, చింత పండు ప్రాసెసింగ్ మిషన్‌లు, అగరువత్తి, ఫుట్‌వేర్ తయారీ యంత్రాలు, ఎలక్ట్రీషియన్, ప్లంబర్ టూల్ కిట్‌లు, పేపర్, లీఫ్ ప్లేట్ మేకింగ్ యంత్రాలను 1234 మందికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నారీమణులకు నీరాజనం

మణికొండ, మార్చి 9: ఎన్నో కష్టనష్టాల మధ్య సామాజిక అవరోధాలను ఎదుర్కొంటూ ముందుకు సాగి చరిత్రలో ప్రముఖంగా నిలిచిన మహిళలు ఎందరో ఉన్నారని వక్తలు పేర్కొన్నారు. డాక్టర్ సి.నారాయణ రెడ్డి స్థాపించిన సుశీలానారాయణరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నగరంలోని సినారె నిలయం విశ్వంభరలో ఏర్పాటు చేసిన సదస్సులో పలువురు ప్రముఖ మహిళలు పాల్గొని నిన్నటి తరం ప్రతిభా మూర్తులైన నారీమణులకు నీరాజనం పలికారు.

సమావేశంలో మాట్లాడుతున్న వక్త

ప్రముఖ స్త్రీవాద రచయిత్రి ఓల్గా మాట్లాడుతూ.. కర్ణాటక సంగీత విద్వాంసురాలు, నర్తకి బెంగళూరు నాగరత్నమ్మ, హిందుస్థాని సంగీత విద్వాంసురాలు నైనాదేవీలు పట్టుదలతో సంగీత నృత్యాల్లో ప్రావీణ్యం, సంస్కృతం, తెలుగు, కన్నడ, తమిళం వంటి భాషల్లో పాండిత్యం సంపాదించి గొప్ప విదుషీమణులుగా పేరుపొంది ధర్మకార్యాలు చేశారని, అయినప్పటికీ ఎన్నో ఈసండిపులకు గురయ్యారన్నారు. అయినప్పటికీ గొప్ప విద్వాంసురాలుగా హిందుస్థాని సంగీత రంగానికి విశేషమైన సేవలందించారన్నారు.

ప్రముఖ నర్తకి, నాట్య గురువు డాక్టర్ యశోదా ఠాకూర్ మాట్లాడుతూ.. ఆలయ ఆస్థాన నృత్య కలను సుసంపన్నం చేసిన దేవదాసీలను సమాజం, ప్రభుత్వం అనేక కష్టాలకు గురి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. భూమిక సంపాదకురాలు, రచయిత్రి కొండవీటి సత్యవతి మాట్లాడుతూ.. పీపుల్స్ వార్ నాయకుడు కొండపల్లి సీతారామయ్య భార్య కొండపల్లి కోటేశ్వరమ్మ గొప్ప ఉద్యమకారిణిగా, రచయిత్రిగా అన్నింటికి మించి ఎన్నో కష్టాలు ఎదుర్కొంటూ కడవరకూ జీవితంతో పోరు సాగించిన వ్యక్తిగా కోటేశ్వరమ్మ చరిత్రలో నిలిచిపోయారన్నారు. ఆమె రచించిన నిర్జన వారధి పుస్తకం చదివితే భర్త అయిన కొండపల్లి సీతారామయ్య చీకటి కోణాలను తెలుసుకోవచ్చన్నారు. సుశీలానారాయణరెడ్డి ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య స్వాగతం పలుకుతూ భారతీయ సమాజానికి వివిధ రంగాల్లో స్వయం కృషితో సేలం దించిన ప్రముఖ మహిళల గురించి ఈ తరానికి తెలియజేసేందుకే నారీమణులకు నీరాజనం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత్రి శీలా సుభద్రా దేవి, ట్రస్ట్ అధ్యక్షురాలు సి.గంగ, సినారె కుటుంబ సభ్యులు, ప్రముఖ రచయిత్రులు, రచయితలు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

'మలబార్' ట్రస్టు సేవలు అభినందనీయం

చందానగర్‌లో గ్రాండ్‌మా హోమ్, హంగర్ ఫ్రీ వరల్డ్ ప్రారంభోత్సవంలో మంత్రి సీతక్క

గ్రాండ్‌మా హోమ్, హంగర్ ఫ్రీ వరల్డ్ కార్యక్రమాల ప్రారంభోత్సవంలో మంత్రి సీతక్క

కొండాపూర్, మార్చి 9 : అనాథ, నిరుపేద మహిళలతోపాటు వృద్ధులకు అండగా నిలిచేందుకు మలబార్ చారిటబుల్ ట్రస్టు సామాజిక బాధ్యతతో చేయూతనివ్వడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డి.అనసూయ సీతక్క అన్నారు. శనివారం చందానగర్‌లో మలబార్ చారిటబుల్ ట్రస్టు, దయ రీహాబిలిటేషన్ ట్రస్టులు సంయుక్తంగా ఏర్పాటు చేసిన 'గ్రాండ్‌మా హోమ్', 'హంగర్ ఫ్రీ వరల్డ్' కార్యక్రమాలను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. సమాజంలోని కుటుంబాల్లో అనేక మార్పులు వస్తున్నాయని, ఇంట్లోని పెద్దలను ఆశ్రమాలలో ఉంచుతూ, ప్రేమానురాగాలకు దూరం చేస్తున్నారన్నారు. ఎన్నో కష్టనష్టాలను ఓదార్చుకుని పెంచి పెద్ద చేసిన వారిని దూరంగా పెట్టడం సరైంది కాదన్నారు. అనాథలు, అబాగ్యులు, నిరుపేద మహిళలకు ఆహారం, బట్టలు, వైద్యం అందించడంతోపాటు వృద్ధులకు వసతిని కల్పించేందుకు మలబార్ చారిటబుల్ ట్రస్టు, దయ రీహాబిలిటేషన్ ట్రస్టులు చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపీ అహ్మద్, వైస్ చైర్మన్ కేపీ అబ్దుల్ సలాం, ఇండియా ఆపరేషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ అషర్ ఓ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నిషాద్, రిటైల్ హెడ్ సిరాజ్, దయ రీహాబిలిటేషన్ ట్రస్ట్ ప్రాజెక్ట్ హెడ్ డాక్టర్ బాసిత్ వడక్కయిల్, శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను కలువడం ఆనందంగా ఉంది

సినీ నటుడు నిఖిల్ సిద్ధార్థ్

ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో
ఆలిండియా బ్రిడ్జి టోర్నమెంట్ ప్రారంభంలో సినీ నటుడు నిఖిల్ తదితరులు

బంజారాహిల్స్, మార్చి 9 : బ్రిడ్జి ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, తెలంగాణ స్టేట్ బ్రిడ్జి అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 12వ ఎఫ్ఎన్‌సీసీ ఆలిండియా ఓపెన్ బ్రిడ్జి టోర్నమెంట్‌ను శనివారం ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో సినీ నటుడు నిఖిల్ సిద్ధార్థ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సినీ నటుడు నిఖిల్ మాట్లాడుతూ.. ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌ను తన చేతులమీదుగా ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను నేరుగా కలువడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఇటీవల చైనాలో జరిగిన పోటీల్లో మెడల్స్ సాధించిన క్రీడాకారులను సత్కరించారు. దక్షిణాదిలోనే అతి పెద్దదైన ఈ టోర్నమెంట్‌లో 68 జట్లు పోటీ పడనున్నాయని ఎఫ్ఎన్‌సీసీ కార్యదర్శి ముళ్ల పూడి మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎన్‌సీసీ ఉపాధ్యక్షుడు తుమ్మల రంగారావు, జాయింట్ సెక్రటరీ పెద్దిరాజు, మాజీ క్రికెటర్ చాముండేశ్వరీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

కూకట్‌పల్లిలో ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు ఆర్థికసాయాన్ని అందిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, సంస్థ చైర్మన్ సీహెచ్.హన్మంతరావు తదితరులు

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 9 : రాష్ట్రంలోని రైతాంగాన్ని అన్ని విధాలుగా ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, రాష్ట్రంలో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు ఆర్థిక సాయం అందించడం అభినందనీయమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శనివారం కూకట్‌పల్లి పీఎన్ఎం పాఠశాల ఆవరణలో వివేకానంద సేవా సమితి చైర్మన్ సీహెచ్.హన్మంతరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు ఆర్థిక సాయం పంపిణీ కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. తెలంగాణలో సాగుచేసే రైతులందరికీ ప్రభుత్వం నుంచి చేయూతనందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైతాంగానికి ఉచిత కరెంటుతోపాటు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా కృషి చేస్తామన్నారు. రైతులు ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయి ఆత్మహత్యలు చేసుకోవద్దని కోరారు. వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో రైతులకు, సైనికుల కుటుంబాలకు సమాజంలోని పేదలకు సాయం అందిస్తూ ఆదర్శంగా నిలిచిందన్నారు. అనంతరం ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాంతా బయోటెక్ చైర్మన్ కేవీ.వరప్రసాద్‌రెడ్డి, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేశ్, మాభూమి వ్యవస్థాపకుడు నర్సింగరావు, భారతీయం సత్యవాణి, అశ్వినీసుబ్బారావు, పొల్సాని సుగుణాకర్‌రావు, శంకర్, ఎన్.క్లాంజరీ, వివేకానంద సేవా సమితి సభ్యులు, ఆయా పార్టీల నేతలు ఉన్నారు.

యూనివర్సిటీలన్నింటిని ఒకేవేదికపైకి తేవడం అభినందనీయం

గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి

బంజారాహిల్స్‌లోని హయత్ ప్లేస్ హోటల్‌లో
గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

బంజారాహిల్స్, మార్చి 9 : విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించాలనుకునే విద్యార్థులకు ప్రముఖ యూనివర్సిటీల్లో అడ్మిషన్ల ప్రక్రియ, వీసా ప్రాసెసింగ్ తదితర అంశాల్లో అవగాహన కల్పించేందుకు బంజారాహిల్స్‌లోని హయత్ ప్లేస్ హోటల్‌లో గ్లోబల్ ట్రీ సంస్థ ఆధ్వర్యంలో గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్-2024ను ఏర్పాటు చేసింది. శనివారం ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను మేడ్చల్ ఎమ్మెల్యే, మల్లారెడ్డి విద్యాసంస్థల చైర్మన్ సీహెచ్.మల్లారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. అంతర్జాతీయ యూనివర్సిటీలను అన్నింటిని ఒకే వేదికపైకి తీసుకురావడం అభినందనీయమన్నారు. గ్రామీణ నేపథ్యం కలిగిన విద్యార్థులు సైతం సరైన అవకాశాలు కల్పిస్తే ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో సీబీఐటీ ప్రిన్సిపాల్ డా.వి.నర్సింహులు, గ్లోబల్ ట్రీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీకర్ అలపాటి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్య తీర్చాలి

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ సమితి అధ్యక్షుడు సైదుల్ రెడ్డి

ఖైరతాబాద్, మార్చి 9 : కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ చేసే ఆలోచన మానుకొని లక్షలాదిగా ఉన్న నిరుద్యోగుల సమస్యలను తీర్చాలని ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ సమితి అధ్యక్షుడు జె.సైదుల్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2006లో కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ విషయంలో కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వంపై కోర్టుకు వెళితే ఎలాంటి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీరణ చెల్లదని, అది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15, 16, 21లకు విరుద్ధమని స్పష్టమైన తీర్పునిచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వం రివేంజ్ గురించి ఆలోచిస్తుందని తప్ప నిరుద్యోగం నుంచి ప్రజలను ఎలా కాపాడాలన్న విషయం ఆలోచించడం లేదన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల కోసం తీసుకువచ్చిన జీవో నం.16ను రద్దు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సమితి నాయకులు ఖలీల్, శంకర్, సంపత్‌కుమార్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ వేదికగా విశ్వశాంతికి బాటలు

- 14 నుంచి హైదరాబాద్‌లో విశ్వజనీన మహోత్సవం
- అన్ని మతాల గురువులకు ఆహ్వానం: కిషన్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ వేదికగా విశ్వశాంతికి బాటలు వేద్దామని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని హార్ట్‌ఫుల్‌నెస్ ప్రధాన కార్యాలయమైన కన్హా శాంతివనంలో ఈ నెల 14 నుంచి 17 వరకు నిర్వహించే 'గ్లోబల్ స్పిరిచువాలిటీ మహోత్సవ్-2024' కార్యక్రమ వివరాలను శనివారం తాజ్ కృష్ణాలో కిషన్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జరుగనున్న ఈ విశ్వజనీన ఆధ్యాత్మిక మహోత్సవానికి ప్రపంచంలోని అన్నిమతాల గురువులను ఆహ్వానిస్తున్నామని కిషన్‌రెడ్డి తెలిపారు. వేలాదిమంది ఆధ్యాత్మిక గురువులు, సుమారు లక్షమంది ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాలు, దేశ ఆధ్యాత్మిక చరిత్ర, శాంతి ప్రబోధాలు ఉంటాయని వివరించారు. ఈ ఉత్సవాల్లో సచిన్ టెండుల్కర్, వీవీఎస్ లక్ష్మణ్, సుధామూర్తి, రామ్‌చరణ్ వంటి వివిధ రంగాల ప్రముఖులు హాజరవుతారని వెల్లడించారు. అన్ని మతాలు విశ్వశాంతినే బోధిస్తాయని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు చిన జీయర్‌స్వామి చెప్పారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌కర్‌తో సహా పలువురు ప్రముఖులను ఆహ్వానిస్తామని హార్ట్‌ఫుల్‌నెస్, శ్రీరామచంద్ర మిషన్ ప్రెసిడెంట్ కమలేశ్ దాజీ తెలిపారు. కార్యక్రమంలో తొమ్మిదో నిజాం నవాబ్ రౌనక్ యార్‌ఖాన్, రెవ. ఆంథోనీపాల్, సత్నామ్‌సింగ్ రాజేంద్రసింగ్, శేఖర్‌రెడ్డి, ప్రజాపతి బ్రహ్మకుమారీస్ డైరెక్టర్ కులదీప్, వెంకమాచార జీ తదితరులున్నారు.

ఆర్టీఐ చట్టం 150 కోట్ల మంది భారతీయులకు జవాబుదారీతనం

- విద్యావంతులు, జర్నలిస్టులు చట్టాన్ని వినియోగించుకోవాలి
- మాజీ ప్రధాన సమాచార హక్కు కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర్లు

సదస్సులో మాట్లాడుతున్న ఉమ్మడి రాష్ట్రాల
మాజీ ప్రధాన ఆర్‌టీఐ కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు

ఖైరతాబాద్, మార్చి 9 : సమాచార హక్కు చట్టం ఒకరు.. ఇద్దరిది కాదని.. 150 కోట్ల మంది భారతీయులకు జవాబుదారీతనంగా నిలుస్తుందని ఉమ్మడి రాష్ట్ర మాజీ ప్రధాన సమాచార హక్కు కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. సమాచార హక్కు సాధన సమితి ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం 'సమాచార హక్కు చట్టం, అమలవుతున్న తీరు, ఎదురవుతున్న సవాళ్లు' అనే అంశంపై సమితి రాష్ట్ర అధ్యక్షుడు గాదెపాక మధుకుమార్ అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. నాడు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ నేతృత్వంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం సమాచార హక్కు చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చిందని, అయితే అదే చట్టం వల్ల ఇద్దరు కేంద్ర మంత్రులు తమ పదవులు సైతం కోల్పోవాల్సి వచ్చిందని గుర్తు చేశారు. అంతటి సత్తా కలిగిన సమాచార హక్కు చట్టాన్ని ప్రస్తుత పాలకులు నిర్వీర్యం చేసే పని పెట్టుకున్నారన్నారు. తాను కమిషనర్‌గా ఉన్న కాలంలో ఏ రోజు కేసులను ఆ రోజే పరిష్కరించే వాడినని, తన హయాంలో ఏడు వేలకు పైగా కేసులను పరిష్కరించానని గుర్తు చేశారు. సమాచారాన్ని ఇవ్వడం వల్ల ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య జవాబుదారీతనం పెరుగుతుందన్నారు. నేడు సమాచార హక్కు చట్టాన్ని విద్యావంతులు, న్యాయవాదులు, జర్నలిస్టులు సరిగా వినియోగించుకోవడం లేదన్నారు. ఈ చట్టంలో రాజకీయ నాయకులు సైతం భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో ఎన్నికల నిఘా వేదిక కన్వీనర్ డాక్టర్ వీవీ.రావు, ఉభయ రాష్ట్రాల మాజీ చీఫ్ ఇంజినీర్ ఎంఎ కరీం, ఆర్టీ కార్యకర్తలు పిట్టల ఈదయ్య, పెరక అభిలాష్, నజబూర్, లుక్మాన్, వంగాల మల్లేశ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీ విద్యార్థులకు ఐఐసీటీలో శిక్షణ

సిటీబ్యూరో, మార్చి 9(నమస్తే తెలంగాణ): కోఠిలోని తెలంగాణ మహిళా యూనివర్సిటీ విద్యార్థులకు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ(ఐఐసీటీ)లో ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు. సీఎస్ఐఆర్ ఇంటిగ్రేటెడ్ స్కిల్ ఇనిషియేటివ్ కార్యక్రమంలో భాగంగా ఆహారం, పోషక రసాయన శాస్త్రంలో అనలిటికల్ నైపుణ్యాలపై, ఫుడ్ ఇండస్ట్రీ రంగంలో ఉన్న అధునాతన కెమికల్ టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇప్పటి వరకు రెండు దఫాలుగా ప్రత్యేక శిక్షణ నిర్వహించినట్లు ఐఐసీటీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ తరహా స్కిల్ డెవలప్ సెషన్లతో విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలను పెంచుతాయని వెల్లడించారు.

16 నుంచి పికిల్‌బాల్ టోర్నీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి : గేమ్‌పాయింట్ ఆధ్వర్యంలో ఈనెల 16, 17 తేదీల్లో పికిల్‌బాల్ చాంపియన్‌షిప్ జరుగబోతున్నది. హైటెక్‌సిటీలోని గేమ్‌పాయింట్ కోర్టులో పురుషుల డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్, 35 ప్లస్ మెన్స్ డబుల్స్ మూడు కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు సిద్ధార్థ్ రెడ్డి శనివారం పేర్కొన్నారు. ఈ టోర్నీలో పోటీ పడాలనుకునే వారు ఈనెల 13వ తేదీ లోపు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 7032777333 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లకు ఓవర్‌లోడ్ గండం

- పేలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లు.. అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు సమకూర్చని వైనం
- చెట్లకొమ్మల నరికివేతకే పరిమితమైన వేసవి కార్యాచరణ
- రికార్డు స్థాయిలో పెరిగిన విద్యుత్ వినియోగం
- క్షేత్రస్థాయిలో ట్రాన్స్‌ఫార్మర్లపై గణనీయంగా పెరిగిన లోడ్

సిటీబ్యూరో, మార్చి 9 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ పరిధిలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరుగుతున్నది. అందుకు తాజా నిదర్శనం.. జీహెచ్ఎంసీ పరిధిలో గతేడాది మార్చి 6వ తేదీ నాటికి 59.53 మిలియన్ యూనిట్లుగా ఉన్న అత్యధిక విద్యుత్ వినియోగం, 2024లో 6వ తేదీన అత్యధికంగా 69.31 మిలియన్ యూనిట్లు, 7వ తేదీన 70.71 మిలియన్ యూనిట్లుగా నమోదైంది. ఇలా విద్యుత్ వినియోగం పెరగడం ఈ సీజన్‌లో ఇదే అధికమని అధికారులు ప్రకటించారు. విద్యుత్ డిమాండ్ ఎంత పెరిగినా దానికి తగ్గట్టుగా సరఫరా అందించేందుకు విద్యుత్ సంస్థలు సంసిద్ధమై ఉన్నాయని ప్రభుత్వం చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో ఉన్న ప్రస్తుత పరిమాణాలు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. ఓవర్ లోడ్‌తో ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. నగర శివారు ప్రాంతాల్లో పట్టణీకరణ వేగంగా చోటుచేసుకుంటున్న ప్రాంతాల్లోని ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌పై 30 శాతానికి పైగా అదనపు లోడు పడుతున్నది. అక్కడ వెంటనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని పెంచడం గానీ, దానిపై ఒత్తిడి తగ్గించేలా అదనంగా మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి కనెక్షన్‌లను తగ్గించడం గానీ చేయాలి.

ఓవర్ లోడ్‌కు ఒక ఉదాహరణ...

సైబర్ సిటీ సర్కిల్ పరిధిలోని గౌలిదొడ్డి ప్రాంతంలో 160 కేవీఏ డీటీఆర్ ఓవర్‌లోడ్‌తో సమస్య ఎదురైందని, లోడ్ బ్యాలెన్సింగ్ కోసం కొత్తగా డిస్ట్రిబ్యూషన్ బాక్స్ ఏర్పాటు చేసినట్లు ట్విట్టర్ వేదికగా ఎస్ఈ ఆపరేషన్స్ సైబర్‌సిటీ పేరుతో ఉన్న ట్విట్టర్ హ్యాండిల్‌లో పోస్టు చేశారు. ఇది ఒక సర్కిల్‌లో ఒక రోజు వచ్చిన ఫిర్యాదు. ఇలా గ్రేటర్ పరిధిలో మొత్తం 9 సర్కిళ్లు ఉన్నాయి. వాటి పరిధిలో తరచూ ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. ముఖ్యంగా ఎక్కువ విద్యుత్ వినియోగం నగర శివారు సర్కిళ్లు అయిన రాజేంద్రనగర్, సైబర్ సిటీ సర్కిల్, హబ్సిగూడ, సరూర్‌నగర్, మేడ్చల్‌లలో ఉన్నది. ఆ తర్వాత కోర్ సిటీ ప్రాంతమైన హైదరాబాద్ సెంట్రల్, హైదరాబాద్ సౌత్, బంజారాహిల్స్, సికింద్రాబాద్ సర్కిళ్లు ఉండగా, రాజేంద్రనగర్, సైబర్ సిటీ సర్కిల్, హబ్సిగూడ, సరూర్‌నగర్, మేడ్చల్‌లో విద్యుత్ వినియోగం గతేడాదితో పోల్చితే చాలా పెరిగింది. ప్రతియేటా విద్యుత్ సంస్థ సమ్మర్ యాక్షన్ ప్లాన్‌ను జనవరి నెలలోనే చేపడుతాయి. ఈసారి జనవరి రెండో వారం నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు వేసవి కార్యాచరణ చేపట్టినా.. ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు మాత్రం ఇప్పటికీ జరగలేదు. కేవలం అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్ స్టేషన్‌లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, కొత్త లైన్లను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని ఒక నివేదికను రూపొందించారు. ఈ రోజుకు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ల మీద పడుతున్న ఓవర్‌లోడ్‌తో వస్తున్న సమస్యలను పరిష్కరిస్తున్నారే తప్ప, అక్కడ అదనంగా అధిక సామర్థ్యంతో కూడిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడంలేదు. ఇలా ఒక చోట ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చేసిన మరమ్మతులు మళ్లీ రెండుమూడు రోజులకే పునరావృతం అవుతున్నాయని వినియోగదారులు వాపోతున్నారు.

ఈసారి ముఖ్యంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు భారీగా పెరగడం, వ్యవసాయంతో పాటు అన్ని కేటగిరీల వినియోదారులకు నిరంతర విద్యుత్ సరఫరా అందుబాటులో ఉండటంతో వినియోగం సైతం భారీగా పెరుగుతున్నది. అదే సమయంలో ఓవర్‌లోడ్‌తో విద్యుత్ అంతరాయాలు సైతం అధికంగా ఉన్నాయని వినియోగదారులు పేర్కొన్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు ఓవర్‌లోడ్ ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ వెంటనే కొత్తగా అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేయాలనే వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

ఎల్‌సీలు ఇవ్వడానికి భయం..

క్షేత్ర స్థాయిలో విద్యుత్ సరఫరా పరంగా అవసరమైన పనులు చేపట్టేందుకు లైన్ క్లియరెన్స్(ఎల్‌సీ) ఇవ్వాల్సి ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నుంచి ఎల్‌సీలు ఇస్తే ఎక్కడ కరెంటు కోతలు విధిస్తున్నారన్న ప్రచారం తలెత్తుతుందన్న భయంతో గత రెండు నెలలుగా ఎల్‌సీలు ఇవ్వడం లేదని, పనులు పూర్తి చేసిన విద్యుత్ కాంట్రాక